# ప్రణాళికతోనే ప్రతిఫలం!

**ఎంబీఏలో చేరడం అంటే రెండేళ్ల జీవితాన్ని ఆ కోర్సులో పెట్టుబడిగా పెడుతున్నట్లు విద్యార్థులు భావించాలి. మొదటి సెమిస్టర్ నుంచే ప్రణాళిక ప్రకారం కొనసాగితే, రెండేళ్లు పూర్తయ్యే సరికి మంచి ఉద్యోగం రూపంలో మీ పెట్టుబడికి తగిన ప్రతిఫలం తప్పకుండా లభిస్తుంది.**




కళ్యాణ్
Husys


ఎంబీఏ చేస్తున్నప్పుడు విద్యార్థులు ప్రధానంగా ఆలోచించాల్సింది... రెండేళ్ల కాలేజీ జీవితం నుంచి వీలైనంత ఎక్కువ ప్రయోజనం పొందడం ఎలా అనే అంశం గురించే! రోజూ కనీసం 8 గంటలు ఎంబీఏ కోసం విద్యార్థులు కేటాయించాలి. అలా చేస్తే రెండేళ్లలో ఎంబీఏ కోసం సమయం రూపంలో మీరు పెట్టే పెట్టుబడి... 5840 గంటలు. ఇంత విలువైన సమయంలో అన్నిటికంటే ముఖ్యంగా నేర్చుకోవడానికి, ఆచరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. భవిష్యత్తుకు సంబంధించి స్పష్టమైన వ్యూహంతో ముందుకుసాగాలి. సెమిస్టర్‌ల వారీగా ఏమేం చేయాలో ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి.

## తొలి అడుగు... కంపెనీలతో నెట్‌వర్క్

మొదటి సెమిస్టర్‌లో విద్యార్థులు అన్నిటికంటే ముందుగా... పరిశ్రమలకు వర్తింపజేస్తూ సిలబస్‌ను అర్థం చేసుకోవాలి. మొదటి సెమిస్టర్‌లో అందరికీ ఉమ్మడి పాఠ్యాంశాలు ఉంటాయి. పారిశ్రామిక సంఘాలు, నెట్‌వర్క్‌లతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి మొదటి సెమిస్టర్ సరైన సమయం. తద్వారా సదస్సులు, సెమినార్లలో పాల్గొనడం, పరిశ్రమల నిపుణులు, ప్రముఖ వ్యక్తుల ఉపన్యాసాలు వినడానికి అవకాశం లభిస్తుంది.



అధ్యాపకుల సహకారంతో కెరియర్ ప్రణాళికను రూపొందించుకోవడానికి కూడా సరైన తరుణమిదే. మేనేజ్‌మెంట్ కెరియర్ గురించి అవగాహన కల్పించడం, తాజా ధోరణులను తెలియజేయడం, భవిష్యత్తు పరిణామాలను అంచనా వేయగల నిపుణులైన అధ్యాపకుల మార్గనిర్దేశం పొందండి.

## రెండో సెమిస్టర్... సాఫ్ట్‌స్కిల్స్‌కు

విద్యార్థిగా మీ బలాబలాలను అంచనా వేసుకోవడం ప్రారంభించాల్సింది ఈ సెమిస్టర్‌లోనే. కార్పొరేట్ రంగానికి మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్‌గా తయారవడానికి పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. ఎంబీఏ పూర్తిచేసేవారిలో 15 శాతం మందికి మాత్రమే ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యాలు ఉంటున్నట్లు నియామక సంస్థల అభిప్రాయం. తమకు ఇష్టమైన రంగంలో, స్పెషలైజేషన్‌లో ఉద్యోగాలు సాధించేవాళ్లు చాలా తక్కువమంది ఉంటున్నారు.

**ఎంబీఏ**

మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్‌కు ఉండాల్సిన కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్, ఇంటర్ పర్సనల్ సామర్థ్యాలు, వ్యాపార అవగాహన, నాయకత్వ లక్షణాలు, పీపుల్ మేనేజ్‌మెంట్, ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవడంపై ఈ సెమిస్టర్‌లో ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలి.

* రెండో సెమిస్టర్ పూర్తయ్యాక కొన్ని కాలేజీలు సెలవులు ఇస్తాయి. మరికొన్ని కాలేజీలు చిన్న ప్రాజెక్టులు చేసే అవకాశం కల్పిస్తాయి. ఒకట్రెండు నెలలపాటు ప్రాజెక్టు చేయడానికి అవకాశమిచ్చే కంపెనీలు చాలా ఉంటాయి. వీటిలో ప్రాజెక్టు చేసే అవకాశం లభిస్తే వదులుకోవద్దు.

## కీలక నిర్ణయం... స్పెషలైజేషన్

మూడో సెమిస్టర్‌లో విద్యార్థులు స్పెషలైజేషన్ ఎంచుకోవాలి. విద్యార్థి భవిష్యత్తుకు సంబంధించి ఇది కీలక నిర్ణయం. మనరాష్ట్రంలోని ఎంబీఏ కాలేజీల్లో హెచ్.ఆర్., ఫైనాన్స్, మార్కెటింగ్, సిస్టమ్స్ లాంటి సంప్రదాయ స్పెషలైజేషన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్ ఎంచుకునే ముందు విద్యార్థి తన సామర్థ్యాలను తానే నిజాయతీతో అంచనా వేసుకోవాలి. విద్యార్థి ఆసక్తి, విద్యానేపథ్యం, సామర్థ్యాలు స్పెషలైజేషన్ ఎంపికలో ముఖ్యంగా పరిగణనలోకి తీసుకోవాలి.

స్పెషలైజేషన్ ఎంపికపై స్పష్టత ఉంటే భవిష్యత్తు లక్ష్యం కూడా అంతే స్పష్టంగా ఉంటుంది. ఇతరులను ఒప్పించడం, నలుగురితో కలివిడిగా ఉండటం లాంటి లక్షణాలు ఉంటే మార్కెటింగ్ ఎంచుకోవచ్చు. ఇతరులతో మంచి సంబంధాలు కొనసాగించడం, పీపుల్ మేనేజ్‌మెంట్, కౌన్సెలింగ్ సామర్థ్యాలుంటే హెచ్.ఆర్. స్పెషలైజేషన్ వైపు మొగ్గు చూపవచ్చు.

## చివరి సెమిస్టర్‌కు... అంతా సిద్ధం!

కెరియర్‌కు సంబంధించిన సామర్థ్యాలను పెంపొందించుకోవడంపై శ్రద్ధపెట్టాలి. సబ్జెక్టుకు పదును పెట్టడంతోపాటు పరిశ్రమల గురించి అవగాహన పెంచుకోవాలి. మీ స్పెషలైజేషన్, సామర్థ్యాలకు సరిపోయే ఉద్యోగాలిచ్చే కంపెనీల జాబితా తయారు చేసుకోవాలి. ప్రత్యామ్నాయ అవకాశాల గురించి కూడా ఆలోచించాలి. చివరి సెమిస్టర్‌లో ఉన్నప్పుడే చాలా కాలేజీలు ఇంటర్న్‌షిప్‌లను ప్రకటిస్తాయి. మూడు నుంచి ఆర్నెళ్లపాటు కొనసాగే ఇంటర్న్‌షిప్ ద్వారా కంపెనీల్లో నిజమైన పని వాతావరణం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ కాలంలో స్టయిపెండ్ కంటే నేర్చుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

### కోర్సు పూర్తయ్యేటప్పటికి...

ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పూర్తయ్యేటప్పటికి మీరు కింది అంశాలను పూర్తిచేసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

- కనీసం ఓ వంద కేస్ స్టడీలను చర్చించి, విశ్లేషించాలి.
- కోర్సుకాలంలో తరగతిలో 20-30 ప్రెజెంటేషన్‌లు ఇవ్వాలి.
- దేశవ్యాప్తంగా కనీసం 10 సెమినార్లకు హాజరవ్వాలి.
- మేనేజ్‌మెంట్ కాలేజీల్లో నిర్వహించే నాలుగైదు పోటీల్లోనైనా పాల్గొనాలి.
- కాలేజీ ప్రచురించే మ్యాగజీన్లలో సొంతగా 2-3 పరిశోధన వ్యాసాలను రాయాలి.
- ఇంటర్నెట్, మ్యాగజీన్లలో లభించే సమాచారం ఆధారంగా కనీసం రెండు ప్రాజెక్టులైనా చేయాలి.
- కంపెనీల్లో రెండు, మూడు వారాలపాటు కొనసాగే చిన్న ప్రాజెక్టులు రెండు చేయగలిగితే మంచిది.
- సాధారణ మేనేజ్‌మెంట్, మీ స్పెషలైజేషన్‌కు సంబంధించిన కనీసం 20 మంది కంపెనీల నిపుణులతో పరిచయాలు ఏర్పరచుకోవాలి.